epaper.janamvoice.com
www.janamvoice.com
06.10.2026
మంగళవారం హైదరాబాద్
RNI NO:TGTEL/26/A0383
డైనమిక్ జనం వాయిస్
తెలుగు దినపత్రిక WWW.JANAMVOICE.COM

# ఎస్ఐఆర్ పెండింగ్ పనులు పండుగకు ముందే పూర్తి చేయాలి

## ఎక్కువ తొలగింపులు, చేర్పులున్న పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి : ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ బి. బాల మాయాదేవి

**జనం వాయిస్, పెద్దపల్లి, అక్టోబరు 5:**

ఎస్ఐఆర్-2026 ప్రక్రియలో పెండింగ్‌లో ఉన్న నోటీసులు, విచారణలను పండుగకు ముందే పూర్తి చేయాలని ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ బి. బాల మాయాదేవి అధికారులను ఆదేశించారు. సోమవారం పెద్దపల్లి ఐడీఓసీలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, అదనపు కలెక్టర్ జె. అరుణ శ్రీతో కలిసి ఎస్ఐఆర్ ప్రక్రియపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా బాల మాయాదేవి మాట్లాడుతూ.. ఎస్ఐఆర్‌కు సంబంధించిన అన్ని రికార్డులను రీకన్సైల్ చేసి, నిర్ణీత కాలపట్టికను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ప్రతి క్లెయిమ్, అభ్యంతరంపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని, ఎలాంటి పెండింగ్ లేకుండా చూడాలని ఆదేశించారు. ఎక్కువ సంఖ్యలో ఓటర్ల తొలగింపులు, చేర్పులు నమోదైన పోలింగ్ కేంద్రాలను గుర్తించి ప్రత్యేకంగా పరిశీలించాలని తెలిపారు. రాజకీయ పార్టీలతో క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహించి, వాటి మినిట్స్‌ను రికార్డుల్లో నమోదు చేయాలని సూచించారు.

**అర్హులైన ఓటర్లను తుది జాబితాలో చేర్చాలి**

జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ.. ఎస్ఐఆర్ ప్రక్రియలో గుర్తించిన అనామలీలు, నో మ్యాపింగ్ ఓటర్లకు




నోటీసులు జారీ చేసి అవసరమైన పత్రాలను సేకరిస్తున్నామని తెలిపారు. బీఎల్ఓలు ఇంటింటికీ వెళ్లి వివరాలు, పత్రాలను సేకరిస్తున్నారని చెప్పారు. అర్హత ఉన్న ఓటర్లను నిబంధనల ప్రకారం తుది జాబితాలో చేర్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.

**18 ఏళ్లు నిండిన యువత నుంచి ఫారం-6 స్వీకరణ**

2026 అక్టోబరు 1 నాటికి 18 సంవత్సరాలు పూర్తిచేసుకున్న అర్హులైన యువత నుంచి ఫారం-6 దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. అర్హులైన



ప్రతి ఒక్కరినీ ఓటరు జాబితాలో చేర్చేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. మున్సిపల్ ప్రాంతాల్లో వార్డు అధికారులు, ఇతర సిబ్బంది కూడా ఎస్ఐఆర్ కార్యక్రమంలో పాల్గొంటూ బీఎల్ఓలకు సహకరిస్తున్నారని తెలిపారు. ఈ నెల చివరి వారంలో మరోసారి జిల్లాను సందర్శించి ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతిని పరిశీలిస్తామని ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ బాల మాయాదేవి తెలిపారు. సమీక్షలో ఆర్డీవోలు గంగయ్య, సురేష్, ఎన్నికల అధికారులు, తహసీల్దార్లు, బీఎల్ఓలు, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలి.

- అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు.
- ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించిన అదనపు కలెక్టర్.

**జనం వాయిస్, పెద్దపల్లి, అక్టోబర్ 05:**

అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలని, ప్రజావాణి దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి అర్జీలను పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలని అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు కలెక్టరేట్ సమావేశం మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు. పెద్దపల్లి మండలం కనగర్తి గ్రామానికి చెందిన బండ్రి అజయ్ కుమార్ తమకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా పీడీ హౌసింగ్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ తెలిపారు. పెద్దపల్లి మండలం రాంపల్లి గ్రామానికి చెందిన గౌడ అశోక్ తన కుమార్తె గౌడ శ్రీవల్లికు 100% వికలాంగత్వం ఉందని తనకు పెన్షన్ మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారికి రాస్తూ నిబంధనల ప్రకారం పరిశీలించి చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ తెలిపారు. ఎలిగేడు మండలం నర్సాపూర్ గ్రామానికి చెందిన తంగెళ అనిత తాను బిఎస్సి నర్సింగ్ పూర్తి చేశానని తనకు జిల్లాలో ఖాళీగా ఉన్న స్టాఫ్ నర్స్ పోస్టుల్లో ఏదైనా ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా వారిది సొసైటీ కి రాస్తూ ఔట్సోర్సింగ్ కింద అవకాశాలు వచ్చినప్పుడు పరిశీలించాలని అదనపు కలెక్టర్ తెలిపారు. రామగిరి మండలం రాజాపూర్ గ్రామానికి చెందిన మల్లేశ్వరి తన ఇంటికి సింగరేణి ప్రాజెక్టు వారు ప్రాజెక్టు నెంబర్ కేటాయించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కు రాస్తూ పరిశీలించి చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ తెలిపారు. ప్రజావాణి కార్యక్రమంలో సంబంధిత జిల్లా అధికారులు,తదితరులు పాల్గొన్నారు.



# పీఆర్సీ సాధన రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలి

## అక్టోబర్ 9న హైదరాబాద్‌లో సదస్సు : సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు

**జనం వాయిస్, పెద్దపల్లి, అక్టోబరు 5:**

ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, వివిధ పథకాల్లో పనిచేస్తున్న కార్మికుల వేతనాలు పెంచడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు డిమాండ్ చేశారు. అక్టోబర్ 9న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించనున్న పీఆర్సీ సాధన రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో రాష్ట్ర సదస్సు కరపత్రాన్ని ఆవిష్కరించిన అనంతరం ముత్యంరావు మాట్లాడుతూ.. మొదటి పీఆర్సీ కాలపరిమితి 2023 జూలైతో ముగిసినా, రెండో పీఆర్సీ నివేదికను తెప్పించుకుని వేతనాలు నిర్ణయించడంలో రాష్ట్ర ప్రభుత్వం జాప్యం చేస్తోందని ఆరోపించారు. 38 నెలలు గడుస్తున్నా పీఆర్సీ అమలుపై




స్పష్టత లేకపోవడం ఉద్యోగులు, కార్మికుల్లో ఆందోళన కలిగిస్తోందన్నారు. ఇటీవల జేఏసీ నాయకత్వంతో జరిగిన చర్చల్లో ప్రభుత్వం రెండు డీఏలకు మాత్రమే పరిమితం చేసిందని, పీఆర్సీ ఎప్పుడు అమలవుతుందనే దానిపై స్పష్టమైన హామీ ఇవ్వలేదని అన్నారు. ప్రభుత్వం ప్రకటించే డీఏలు కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, స్థానిక సంస్థల కార్మికులు, బహుళ ప్రయోజన ఉద్యోగులు, పథక కార్మికులకు వర్తించకపోవడంతో వారు నష్టపోతున్నారని తెలిపారు.

**కనీస వేతనం రూ.30 వేలు ఇవ్వాలి**

పీఆర్సీ పరిధిలో లేని ఉద్యోగులు, కార్మికులను కూడా పీఆర్సీ పరిధిలోకి తీసుకువచ్చి వేతనాలు పెంచాలని ముత్యంరావు డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, పథక కార్మికులకు నెలకు కనీస వేతనం రూ.30 వేలుగా నిర్ణయించాలని, డీఏలు అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. అక్టోబర్ 9న మధ్యాహ్నం 1 గంటకు హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగే రాష్ట్ర సదస్సుకు జిల్లాలోని ఉద్యోగులు, కార్మికులు పెద్ద సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు జి. జ్యోతి, సిపల్లి రవీందర్, ఎం.డి. కాజా, బొంకూరి సాగర్, జంగపల్లి నరేష్, దొడ్డే బాబు, సలిగంటి రాజేష్, శంకర్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

# పెద్దకల్వలలో బీఆర్ఎస్‌కు షాక్.

## కాంగ్రెస్‌లో చేరిన బిఆర్ ఎస్ నాయకులు.

**జనం వాయిస్, పెద్దపల్లి, అక్టోబర్ 05:**



పెద్దకల్వల గ్రామ ఉప సర్పంచ్ పర్స లక్ష్మి శంకర్, ఒకటో వార్డు సభ్యురాలు జక్కుల రుక్కమ్మతో పాటు బీఆర్ఎస్ నాయకులు లక్ష్మీనారాయణ, పర్స పవన్ కళ్యాణ్ తదితరులు బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్ పార్టీలో చేరారు. రాష్ట్ర ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు వారికి కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ బలోపేతానికి, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రామగుండం ప్రభుత్వ అస్పత్రిలో నిర్లక్ష్యమా?

**నిధులు వస్తున్నా పేదలకు మెరుగైన వైద్యం అందడం లేదని ఆరోపణలు.**
**ఆర్‌టీఐ ద్వారా కీలక వివరాలు కోరిన సేవా స్ఫూర్తి ఫౌండేషన్ అధ్యక్షుడు మడిపెల్లి మల్లేష్.**

**జనం వాయిస్, రామగుండం, అక్టోబరు 5:**

రామగుండం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో అధికారుల నిర్లక్ష్యం కారణంగా పేద రోగులకు సరైన వైద్యం, మందులు, మౌలిక వసతులు అందడం లేదని సేవా స్ఫూర్తి ఫౌండేషన్ అధ్యక్షుడు మడిపెల్లి మల్లేష్ ఆరోపించారు. నియోజకవర్గ ప్రజలకు మెరుగైన ఉచిత వైద్యం అందించాలనే ఉద్దేశంతో ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ రాష్ట్ర ప్రభుత్వం నుంచి నిధులు తీసుకువస్తున్నప్పటికీ.. ఆసుపత్రి స్థాయిలో వాటి



వినియోగం, రోగులకు అందుతున్న సేవల్లో లోపాలు ఉన్నాయని ఆయన విమర్శించారు. ఆసుపత్రిలో ఫ్యాన్లు సక్రమంగా పనిచేయడం లేదని, అత్యవసర విభాగంలో సరైన గాలి ప్రసరణ లేక రోగులు ఇబ్బందులు పడుతున్నారని మల్లేష్ పేర్కొన్నారు. పారిశుధ్య నిర్వహణ సైతం అధ్వానంగా ఉందని, ఎక్స్‌రే, స్కానింగ్ వంటి పరికరాలు అందుబాటులో ఉన్నప్పటికీ పూర్తిస్థాయిలో పనిచేయడం లేదని ఆరోపించారు. పేద రోగులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడంలో అధికారులు విఫలమవుతున్నారని అన్నారు.

**ఆర్‌టీఐతో వివరాల సేకరణ**

ఆసుపత్రిలో నిధుల వినియోగం, మందుల కొనుగోళ్లు, వైద్య పరికరాలు, ఇంప్లాంట్లు, పారిశుధ్యం, భద్రతా సిబ్బందికి సంబంధించిన వివరాలను తెలుసుకునేందుకు సోమవారం సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తు చేసినట్లు మల్లేష్ తెలిపారు. 2020 నుంచి 2025 వరకు ఆసుపత్రికి వచ్చిన ఆరోగ్యశ్రీ నిధులు, వాటి వినియోగానికి సంబంధించిన ఆసుపత్రి అభివృద్ధి సంఘం తీర్మానాలు, మందుల స్థానిక కొనుగోళ్లకు సంబంధించిన వివరాలను కోరినట్లు చెప్పారు. అదేవిధంగా ల్యాప్రోస్కోపిక్ పరికరాల కొనుగోళ్లు, ఆర్థోపెడిక్ విభాగంలో ఉపయోగించిన ఇంప్లాంట్ల వివరాలు, పారిశుధ్యం, రోగుల సంరక్షణ, భద్రతా సిబ్బంది కాంట్రాక్టర్లు, సిబ్బంది సంఖ్య, వేతన చెల్లింపుల వివరాలను కూడా ఆర్‌టీఐ ద్వారా కోరినట్లు వెల్లడించారు.

**ఉన్నతాధికారులు విచారణ చేయాలి**

ఆసుపత్రిలో జరుగుతున్నట్లు తాను పేర్కొంటున్న లోపాలు, అవకతవకలపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపించాలని మల్లేష్ డిమాండ్ చేశారు. ప్రజల ఆరోగ్యానికి సంబంధించిన ప్రభుత్వ ఆసుపత్రుల్లో నిర్లక్ష్యానికి తావులేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ ప్రభుత్వ నిధులు తీసుకువస్తున్న నేపథ్యంలో వాటిని సక్రమంగా వినియోగించి పేదలకు మెరుగైన వైద్య సేవలు అందేలా చూడాలని ఆయన కోరారు.

# మహనీయుల స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకోవాలి

## పేదల సంక్షేమం కోసం వెంకటస్వామి చేసిన సేవలు చిరస్మరణీయం : కలెక్టర్ కోయ శ్రీహర్ష

**జనం వాయిస్, పెద్దపల్లి, అక్టోబరు 5:**

మహనీయుల స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకుని ప్రజలకు సేవ చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. సోమవారం పెద్దపల్లి సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో గడ్డం వెంకటస్వామి (కాక) జయంతి వేడుకలు నిర్వహించారు. అదనపు కలెక్టర్ బి. శ్రీరాములుతో కలిసి కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి, వెంకటస్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా



కలెక్టర్ మాట్లాడుతూ మారుమూల ప్రాంతంలో జన్మించిన గడ్డం వెంకటస్వామి కేంద్ర మంత్రిగా, వివిధ కీలక పదవుల్లో పనిచేస్తూ ప్రజలకు విశేష సేవలందించారని కొనియాడారు. పేదల సంక్షేమం, అట్టడుగు వర్గాల అభ్యున్నతి కోసం ఆయన చేసిన కృషి స్ఫూర్తిదాయకమన్నారు. ప్రభుత్వ భూములను పేదలకు పంపిణీ చేయడంలో వెంకటస్వామి కీలక పాత్ర పోషించారని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం, ప్రజల సమస్యల పరిష్కారం కోసం వెంకటస్వామి నిరంతరం కృషి చేశారని అన్నారు. ముఖ్యంగా కోల్‌బెల్ట్ ప్రాంత కార్మికుల హక్కులు, సంక్షేమం కోసం ఆయన చేసిన సేవలతో ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని పేర్కొన్నారు. ఆయన స్ఫూర్తితో అధికారులు, సిబ్బంది విధులు నిర్వహిస్తూ పేదలు, అట్టడుగు వర్గాలకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాలన అధికారి ప్రకాష్, సీపీఓ రవీందర్, ఇంటర్మీడియట్ అధికారి కల్పన, యువజన, క్రీడల శాఖ అధికారి సురేష్, జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఎన్ఐటీ విద్యార్థికి మూడో నెల ఆర్థిక సాయం

## సహాయక చెక్ అందజేసిన సేవా స్ఫూర్తి ఫౌండేషన్ అధ్యక్షుడు మడిపెల్లి మల్లేష్

**జనం వాయిస్, రామగుండం, అక్టోబరు 5:**

పేద, ప్రతిభావంతులైన విద్యార్థులకు అండగా నిలుస్తున్న సేవా స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎన్ఐటీ వరంగల్‌లో చదువుతున్న అక్కిపెల్లి కీర్తి చరణ్‌కు మూడో నెల ఆర్థిక సహాయాన్ని అందించారు. రామగుండం కార్పొరేషన్ 59వ డివిజన్ అశోక్‌నగర్‌కు చెందిన కీర్తి చరణ్ జేఈఈ మెయిన్స్‌లో 96 శాతం పర్సంటైల్ సాధించి ఎన్ఐటీ వరంగల్‌లో కెమిస్ట్రీ విభాగంలో సీటు పొందారు. విద్యార్థి ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని నాలుగేళ్ల విద్యాభ్యాసానికి ప్రతి నెలా రూ.2,000 పాకెట్ మనీ అందిస్తామని ప్రకటించిన ఫౌండేషన్ అధ్యక్షుడు మడిపెల్లి మల్లేష్.. ఇచ్చిన మాట ప్రకారం వరుసగా సహాయం అందిస్తున్నారు. ఇప్పటికే రెండు విడతల సాయం అందించగా, సోమవారం రామగుండం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మూడో నెల సహాయక చెక్‌ను విద్యార్థి తండ్రి అక్కిపెల్లి కీర్తి శ్రీనివాస్‌కు అందజేశారు. ఈ సందర్భంగా మల్లేష్ మాట్లాడుతూ.. ఆర్థిక ఇబ్బందులు విద్యార్థుల భవిష్యత్తుకు అడ్డంకిగా మారకూడదనే ఉద్దేశంతో ఈ సహాయం అందిస్తున్నామని తెలిపారు. కీర్తి చరణ్ ఎన్ఐటీలో ఉన్నతంగా చదివి



భవిష్యత్తులో మంచి స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. తమ కుమారుడి చదువుకు క్రమం తప్పకుండా అండగా నిలుస్తున్న మడిపెల్లి మల్లేష్, ఫౌండేషన్ సభ్యులకు శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు.

# వధ కోసం పశువుల అక్రమ రవాణా.. డీసీఎం పట్టివేత

## మంథని ఎస్ఐ ఎన్. సందీప్ కుమార్ ఆధ్వర్యంలో 31 పశువుల స్వాధీనం

**జనం వాయిస్, మంథని, అక్టోబర్ 5:**

మంథని పోలీస్‌స్టేషన్ పరిధిలో పశువులను అక్రమంగా తరలిస్తున్న డీసీఎం వ్యాన్‌ను పోలీసులు పట్టుకున్నారు. సోమవారం తెల్లవారుజామున భట్టుపల్లి రోడ్డుపై రాత్రి పెట్రోలింగ్‌లో భాగంగా వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా భూపాలపల్లి వైపు నుంచి మంథని వైపు వెళ్తున్న టీఎస్ 12 యూడీ 4009 నంబర్ డీసీఎం వ్యాన్‌ను పోలీసులు ఆపి తనిఖీ చేశారు. తనిఖీలో వ్యాన్‌లో 22 ఆవులు, 9 ఎద్దులు.. మొత్తం 31 పశువులను ఇరుకుగా కట్టి, మేత, నీరు, తగినంత స్థలం లేకుండా తరలిస్తున్నట్లు గుర్తించారు. పశువుల యాజమాన్య పత్రాలు, రవాణా అనుమతి, పశువైద్య ధృవపత్రాలు చూపించకపోవడంతో పోలీసులు ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారించారు. విచారణలో పశువులను వధ కోసం తరలిస్తున్నట్లు వెల్లడైనట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనలో సిద్దిపేటకు చెందిన మహమ్మద్ సద్దాం, కరీంనగర్‌కు చెందిన మహమ్మద్ రిజ్వాన్‌ను అదుపులోకి తీసుకున్నారు. మధ్యవర్తుల సమక్షంలో డీసీఎం వ్యాన్‌తో పాటు 31 పశువులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం పశువులను భట్టుపల్లిలోని కపిల గోశాలకు సురక్షితంగా తరలించారు. ఈ ఘటనపై మంథని పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఎస్ఐ ఎన్. సందీప్ కుమార్ తెలిపారు.




# మంథనిలో దళిత బంధు అమలు ఎక్కడ?

## కాంగ్రెస్ ప్రభుత్వంపై దళిత బంధు సాధన సమితి ప్రశ్నలు

**జనం వాయిస్, హైదరాబాద్, అక్టోబరు 5:**

మంథని నియోజకవర్గంలో దళిత బంధు, అంబేద్కర్ అభయహస్తం పథకాల అమలుపై రాష్ట్ర దళిత బంధు సాధన సమితి నాయకులు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో రాష్ట్ర అధ్యక్షుడు కోకిల మహేష్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ అధ్యక్షుడు గద్దల శంకర్, మంథని డివిజన్ అధ్యక్షుడు ఊట్ల శ్రీను మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మంథని నియోజకవర్గంలో 100 దళిత కుటుంబాలకు దళిత బంధు కింద రూ.10 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందించారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అంబేద్కర్ అభయహస్తం పేరుతో దళితులకు రూ.12 లక్షలు అందిస్తామని హామీ ఇచ్చిందని, ఇప్పటివరకు మంథని నియోజకవర్గంలో ఎంతమందికి నిధులు అందించారో ప్రభుత్వం స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గానికి చెందిన మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు దళిత సంక్షేమ పథకాల అమలుపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. సమావేశంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.



RNI NO:TGTEL/26/A0383
దైనమిక్ జనం వాయిస్
తెలుగు దినపత్రిక WWW.JANAMVOICE.COM

# నిరుద్యోగులకు ఉద్యోగ మేళా.

**40 కొలువులు సిద్ధం!**

**అక్టోబర్ 9న జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలి.**

**జిల్లా ఉపాధి కల్పనాధికారి ఎం. రాజశేఖర్.**

**జనం వాయిస్, పెద్దపల్లి, అక్టోబర్ 5:**



జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఈ నెల 9వ తేదీన ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి ఎం. రాజశేఖర్ తెలిపారు. సోమవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన ఈ వివరాలను వెల్లడించారు. కేకే ఎంటర్‌ప్రైజెస్ సంస్థలో మొత్తం 40 ఉద్యోగ ఖాళీలు ఉన్నాయని తెలిపారు. ఇందులో 10 సోలార్ ఫిట్టింగ్ టెక్నీషియన్, 30 సేల్స్ ఎగ్జిక్యూటివ్‌లు, సేల్స్ ఆఫీసర్ పోస్టులు ఉన్నాయని పేర్కొన్నారు. ఎంపికైన వారికి పెద్దపల్లి ప్రాంతంలోనే పని ఉంటుందని తెలిపారు. సోలార్ ఫిట్టింగ్ టెక్నీషియన్ పోస్టులకు మెకానికల్ లేదా ఎలక్ట్రికల్ నేపథ్యం కలిగిన పురుష అభ్యర్థులు అర్హులని, ఎంపికైన వారికి నెలకు రూ.15 వేల వేతనం అందజేస్తారని తెలిపారు. సేల్స్ ఎగ్జిక్యూటివ్, సేల్స్ ఆఫీసర్ పోస్టులకు ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ, ఎంబీఏ విద్యార్హతలు కలిగిన పురుషులు, మహిళలు అర్హులని, ఎంపికైన వారికి నెలకు రూ.20 వేల వేతనం అందజేస్తారని పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు అక్టోబర్ 9న ఉదయం 10 గంటలకు తమ అప్‌డేటెడ్ సీవీ/రెజ్యూమ్, విద్యార్హతల జిరాక్స్ కాపీలు, అప్‌డేటెడ్ ఆధార్ జిరాక్స్, అనుభవ ధ్రువీకరణ పత్రం ఉంటే దానితో సమీకృత జిల్లా కలెక్టర్ కార్యాలయం (ఐడీఓసీ) మొదటి అంతస్తులోని రూమ్ నంబర్ 233, పెద్దకల్వల, పెద్దపల్లిలోని జిల్లా ఉపాధి కల్పనాధికారి కార్యాలయానికి హాజరై పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 8985336347, 8121252443 నంబర్లలో సంప్రదించాలని జిల్లా ఉపాధి కల్పనాధికారి ఎం. రాజశేఖర్ తెలిపారు.

# కార్మికుల పక్షపాతి కాకా వెంకటస్వామి

**జయంతి వేడుకల్లో ఘనంగా నివాళులర్పించిన బీజేపీ నేత ములుమూరి శ్రీనివాస్**

**జనం వాయిస్, రామగిరి, అక్టోబర్ 5:**



రామగిరి మండలం సెంటినరీ కాలనీలో మాజీ ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు, బీజేపీ నేత ములుమూరి శ్రీనివాస్ కాకా వెంకటస్వామి 97వ జయంతి సందర్భంగా ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెద్దపల్లి పార్లమెంటు నియోజకవర్గం ప్రజలు, ముఖ్యంగా కార్మికుల హక్కుల కోసం పార్లమెంటులో కాకా వెంకటస్వామి చేసిన పోరాటం మరువలేనిదన్నారు. కార్మికులకు ప్రావిడెంట్ ఫండ్, పింఛన్, ఆరోగ్య భద్రత వంటి సౌకర్యాలు అందేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడంలో వెంకటస్వామి కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. కార్మికుల హక్కుల కోసం నిరంతరం పోరాడిన నాయకుడిగా దేశవ్యాప్తంగా గుర్తింపు పొందారని అన్నారు. బడుగు, బలహీన వర్గాల ప్రజలకు అండగా నిలిచిన వెంకటస్వామి ఈ ప్రాంతానికి చెందిన గొప్ప నాయకుడని, కార్మికుల హక్కుల సాధనకు ఆయన చేసిన కృషి చిరస్థాయిగా నిలిచిపోతుందని ములుమూరి శ్రీనివాస్ కొనియాడారు.

# ఇంటి కూల్చివేతపై ఉద్రిక్తత

- **అనుమతులు ఉన్నా ఇల్లు కూల్చే ప్రయత్నం చేశారంటూ ఆరోపణలు.**
- **అధికారుల తీరును అడ్డుకున్న కాలనీవాసులు.**





**జనం వాయిస్, రామగుండం, అక్టోబర్ 5:**

రామగుండం నియోజకవర్గంలోని 57వ డివిజన్ ఎన్టీఆర్ నగర్‌లో ఇంటి కూల్చివేత విషయంలో మున్సిపల్ అధికారులు, స్థానికుల మధ్య తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. స్థానికుల వివరాల ప్రకారం.. ఎన్టీఆర్ నగర్‌కు చెందిన సింగరేణి ఉద్యోగి ముదరబోయిన రమేష్ గత 52 ఏళ్లుగా 70 గజాల స్థలంలో నివాసం ఉంటున్నారు. పాత ఇల్లు శిథిలావస్థకు చేరడంతో అవసరమైన అనుమతులు తీసుకుని నూతన భవన నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. అయితే 30 అడుగుల రహదారి విస్తరణకు స్థలం అవసరమంటూ మున్సిపల్ అధికారులు జేసీబీలతో వచ్చి నిర్మాణాన్ని తొలగించే ప్రయత్నం చేశారని రమేష్ కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఈ విషయం తెలుసుకున్న కాలనీవాసులు, బీఆర్ఎస్ నాయకుడు, కార్పొరేటర్ అభ్యర్థి బూరుగు వంశీకృష్ణ అక్కడికి చేరుకుని అధికారుల చర్యలను అడ్డుకున్నారు. అన్ని అనుమతులు ఉన్నప్పటికీ ఇంటిని ఎందుకు తొలగించాల్సి వస్తుందని స్థానికులు అధికారులను ప్రశ్నించారు. రహదారి విస్తరణలో భాగంగా కొత్తగా నిర్మించే ఇళ్లకు 30 అడుగుల రహదారికి అనుగుణంగా స్థలం వదలాల్సి ఉంటుందని అధికారులు వివరించినట్లు కాలనీవాసులు తెలిపారు. దీంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. సమస్యకు స్పష్టమైన పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు సమగ్ర చర్యలు

**బ్లాక్‌స్పాట్లు, ప్రమాదకర ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి.**

**పెద్దపల్లి డీసీపీ బి. రామ్‌రెడ్డి.**



**జనం వాయిస్, గోదావరిఖని, అక్టోబర్ 5:**

రోడ్డు ప్రమాదాల నివారణకు సమగ్ర చర్యలు చేపట్టాలని పెద్దపల్లి డీసీపీ బి. రామ్‌రెడ్డి పోలీసు అధికారులను ఆదేశించారు. రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆదేశాల మేరకు గోదావరిఖని 1 టౌన్ పోలీస్ స్టేషన్‌లో రోడ్డు ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ క్రమబద్ధీకరణపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. గోదావరిఖని 1 టౌన్, 2 టౌన్, రామగుండం సర్కిల్, పెద్దపల్లి పరిధిలో తరచూ ప్రమాదాలు జరిగే ప్రాంతాలు, ప్రమాదకర మలుపులు, కూడళ్ళు, రద్దీ ప్రాంతాలను గుర్తించి అవసరమైన భద్రతా చర్యలు చేపట్టాలని డీసీపీ సూచించారు. సంబంధిత శాఖల సమన్వయంతో ప్రమాదకర ప్రాంతాల్లో రంబుల్ స్టిక్స్, హెచ్చరిక బోర్డులు, ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రహదారులపై భారీ వాహనాల అక్రమ పార్కింగ్‌ను నియంత్రించాలని, రాంగ్‌సైడ్ డ్రైవింగ్‌పై నిఘా పెంచి కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఆటోలు, పాఠశాల వ్యాన్లు, బస్సుల్లో పరిమితికి మించి విద్యార్థులను తరలించకుండా ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని సూచించారు. మైనర్ డ్రైవింగ్, ట్రిపుల్ రైడింగ్, సిగ్నల్ జంపింగ్ తదితర ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలపై కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. వాహనాల రాకపోకలకు అంతరాయం కలగకుండా ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాలని, వాహనదారులకు ముందస్తు హెచ్చరికలు అందేలా అవసరమైన సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని డీసీపీ పేర్కొన్నారు. పోలీసు, సంబంధిత శాఖలు సమన్వయంతో నిరంతరం చర్యలు చేపట్టి ప్రజల ప్రాణాలను కాపాడటానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో రామగుండం సీఐ కృష్ణకుమార్, గోదావరిఖని 1 టౌన్ ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి, గోదావరిఖని 2 టౌన్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్‌రావు, రామగుండం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాజేశ్వర్‌రావు, పెద్దపల్లి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# కేసముద్రం రైల్వే స్టేషన్‌లో లిఫ్ట్ సౌకర్యం కల్పించాలి

**వృద్ధులు, మహిళలు, దివ్యాంగులకు మెట్ల కష్టాలు.. మరోవైపు టికెట్ కౌంటర్ కోసం అవస్థలు.**

**రైల్వే అధికారులు స్పందించి మౌలిక వసతులు కల్పించాలని ప్రయాణికుల విజ్ఞప్తి.**

**జనం వాయిస్, కేసముద్రం, అక్టోబర్ 5:**

మహబూబాబాద్ జిల్లాలో కీలకమైన కేసముద్రం రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల ఇబ్బందులు తొలగించేందుకు లిఫ్ట్ సౌకర్యం కల్పించాల్సిన అవసరం ఉందనే డిమాండ్ బలంగా వినిపిస్తోంది. వ్యవసాయ ఉత్పత్తుల క్రయవిక్రయాలు, వ్యాపార, వాణిజ్య కార్యకలాపాలకు కేంద్రంగా ఉన్న కేసముద్రం చుట్టుపక్కల గ్రామాలు, గిరిజన తండాల ప్రజలకు ఈ రైల్వే స్టేషన్ ఎంతో కీలకంగా ఉంది. న్యూఢిల్లీ--చెన్నై ప్రధాన రైల్వే మార్గంలో ఉన్న ఈ స్టేషన్ మీదుగా పలు ముఖ్యమైన రైళ్లు రాకపోకలు సాగిస్తున్నాయి. దీంతో ప్రతిరోజూ పెద్ద సంఖ్యలో ప్రయాణికులు స్టేషన్‌ను వినియోగిస్తున్నారు. అయితే ప్రయాణికుల సంఖ్యకు అనుగుణంగా అవసరమైన మౌలిక సదుపాయాలు మాత్రం పూర్తిస్థాయిలో అందుబాటులో లేవనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



**మెట్లే ప్రధాన సమస్య**

స్టేషన్‌లో మూడు ప్లాట్‌ఫారమ్‌లు ఉండగా, ఒక ప్లాట్‌ఫారమ్ నుంచి మరో ప్లాట్‌ఫారమ్‌కు వెళ్లేందుకు ఫుట్‌ఓవర్ బ్రిడ్జినే ప్రధాన మార్గంగా ఉపయోగించాల్సి వస్తోంది. ఎత్తైన మెట్లు ఎక్కడం వృద్ధులు, మహిళలు, అనారోగ్యంతో ఉన్నవారు, చిన్నపిల్లలతో ప్రయాణించే తల్లులు, దివ్యాంగులకు తీవ్ర ఇబ్బందిగా మారుతోంది. లగేజీతో మెట్లు ఎక్కాల్సి రావడంతో సాధారణ ప్రయాణికులు సైతం అవస్థలు పడుతున్నారు. రైలు వచ్చే సమయం దగ్గరపడినప్పుడు ప్రయాణికులు హడావుడిగా మెట్లు ఎక్కాల్సి రావడం వల్ల ప్రమాదాల ముప్పు కూడా ఉందని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వృద్ధులు ఒక్కో మెట్టు ఎక్కేందుకు తీవ్రంగా శ్రమించాల్సి వస్తోందని, కొంతమంది మధ్యలోనే ఆగి విశ్రాంతి తీసుకోవాల్సి వస్తోందని చెబుతున్నారు. మరోవైపు ఒకే వైపు టికెట్ కౌంటర్ ఉండటం కూడా ప్రయాణికులకు అదనపు భారంగా మారుతోంది. టికెట్ కోసం ఒక వైపు వెళ్లి, తిరిగి రైలు ఎక్కేందుకు మరో ప్లాట్‌ఫారమ్‌కు చేరుకోవాల్సి వస్తుండటంతో వృద్ధులు, దివ్యాంగులు, నడవడానికి ఇబ్బంది పడేవారు మరింత ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



**లిఫ్ట్‌తో పాటు ఎస్కలేటర్ ఏర్పాటు చేయాలి**

రైల్వే స్టేషన్ల ఆధునీకరణలో భాగంగా దేశవ్యాప్తంగా ప్రయాణికులకు లిఫ్టులు, ఎస్కలేటర్లు వంటి సౌకర్యాలు కల్పిస్తున్న నేపథ్యంలో కేసముద్రం స్టేషన్‌లోనూ ఇలాంటి సదుపాయాలను ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు. ముఖ్యంగా ఫుట్‌ఓవర్ బ్రిడ్జి వద్ద లిఫ్ట్ ఏర్పాటు చేసి మూడు ప్లాట్‌ఫారమ్‌లకు సులభంగా చేరుకునే అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. అవసరాన్ని బట్టి ఎస్కలేటర్ సౌకర్యాన్ని కూడా ఏర్పాటు చేయాలని, మరో వైపు టికెట్ కౌంటర్ ఏర్పాటు చేసి ప్రయాణికుల రాకపోకలను సులభతరం చేయాలని కోరుతున్నారు. విద్య, వైద్యం, ఉపాధి, వ్యాపార అవసరాల కోసం కేసముద్రం చుట్టుపక్కల గిరిజన తండాలు, గ్రామాల ప్రజలు రైలు ప్రయాణాలపై ఆధారపడుతున్న నేపథ్యంలో రైల్వే అధికారులు ఈ సమస్యను మానవతా దృక్పథంతో పరిగణనలోకి తీసుకోవాలని కోరుతున్నారు. అధికారులు స్టేషన్‌ను ప్రత్యక్షంగా పరిశీలించి ప్రయాణికుల సమస్యలను తెలుసుకుని లిఫ్ట్ సహా అవసరమైన మౌలిక సదుపాయాలను త్వరితగతిన కల్పించాలని ఆళవందార్ వేణు మాధవ్ కోరారు.

# సింగరేణి కార్మికులకు 40 శాతం లాభాల వాటా ఇవ్వాలి

- **రూ.59 వేల కోట్ల బకాయిలు వెంటనే చెల్లించాలి.**
- **భద్రతా పరికరాలు, పనిముట్లు అందుబాటులో ఉంచాలి: ఏఐటీయూసీ.**

**జనం వాయిస్, గోదావరిఖని, అక్టోబర్ 5:**



సింగరేణి సంస్థలో కార్మికులకు రావాల్సిన వాస్తవ లాభాల్లో 40 శాతం వాటాను వెంటనే ప్రకటించి చెల్లించాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. సింగరేణి ఆర్జీ-1 ఏరియాలోని గనులు, విభాగాలు, ఓసీపీ-5 అధికారులకు సోమవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో పలు సమస్యల పరిష్కారం కోరుతూ వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లా గౌడ్, కేంద్ర కార్యదర్శి కవ్వంపల్లి స్వామి, బ్రాంచి కార్యదర్శి రంగు శ్రీను మాట్లాడుతూ.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో సింగరేణికి వచ్చిన వాస్తవ లాభాలను వెంటనే ప్రకటించి, అందులో 40 శాతం కార్మికులకు అందించాలని కోరారు. 1963లో ఏఐటీయూసీ నాయకత్వంలో సాధించిన బోనస్ చట్టం ద్వారా కార్మికులకు ప్రయోజనాలు చేకూరాయని, కార్మికుల హక్కుల కోసం ఏఐటీయూసీ నిరంతరం పోరాడుతోందని తెలిపారు. గనుల్లో పనిచేస్తున్న కార్మికుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, రక్షణ పరికరాలు, పనిముట్లు, భద్రతా సామగ్రిని ఎలాంటి జాప్యం లేకుండా అందించాలని డిమాండ్ చేశారు. సరైన భద్రతా పరికరాలు లేకుండా కార్మికులతో పనులు చేయించడం ప్రమాదకరమని పేర్కొన్నారు. అలాగే తెలంగాణ జెన్‌కో సంస్థ నుంచి సింగరేణికి రావాల్సిన రూ.59 వేల కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బకాయిల వసూళ్లకు సింగరేణి యాజమాన్యం తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. కార్మికుల ఆర్థిక ప్రయోజనాలు, బోనస్, లాభాల వాటా కోసం ఏఐటీయూసీ చేసిన పోరాటాలను గుర్తించాలని, కార్మిక ప్రయోజనాలకు వ్యతిరేకంగా వ్యవహరించే సంఘాల వైఖరిని కార్మికులు ప్రశ్నించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంకె అశోక్, బోగ సతీష్ బాబు, గండి ప్రసాద్, దొంత సాయన్న, ఎం. చక్రపాణి, పి. విజయలక్ష్మి, మానాల శ్రీనివాస్, పొన్నాల వెంకటయ్య, కారంపూరి వెంకన్న, గుర్రం ప్రభుదాస్, నాయిని శంకర్, గొడిశల నరేశ్, చెప్యాల భాస్కర్, బండి మల్లేష్, దాసరి శ్రీనివాస్, బిట్టి వెంకటేశ్వర్లు, దాసరి అనిల్, అటికేటి రాజు, ఉప్పులేటి తిరుపతి, అజీం, ఎర్రవెల్లి రాజయ్య, పి. రవి, సానా జలపతి, పర్లపెల్లి రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

# ఐస్‌క్రీమ్ కేంద్రంలో అపరిశుభ్రత

- **కాలం చెల్లిన పాలు.. మాడిపోయిన కోవా.. తేదీలు లేని బాదం పాలు.**
- **ధూమపానం చేస్తూ ఆహార తయారీ.. సాలెగూళ్లు, కీటకాల మధ్య ఉత్పత్తుల తయారీ.**
- **సాయి సవారియా యూనిట్ ఎఫ్ఎస్ఎస్ఏఐ నమోదు తాత్కాలిక నిలిపివేత.**

**జనం వాయిస్, పెద్దపల్లి, అక్టోబర్ 5:**

పెద్దపల్లి నారాయణ్‌పూర్ ఎక్స్‌రోడ్‌లోని సుగ్లంపల్లి వద్ద ఉన్న మెస్సర్స్ సాయి సవారియా ఐస్‌క్రీమ్ తయారీ కేంద్రంలో ఆహార భద్రత అధికారుల తనిఖీల్లో విస్తుపోయే స్థాయిలో నిబంధనల ఉల్లంఘనలు వెలుగుచూశాయి. ఫిర్యాదు ఆధారంగా ఆహార భద్రత అధికారి అరవింద్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన తనిఖీల్లో కాలం చెల్లిన పాలు, మాడిపోయిన కోవా, తయారీ--గడువు తేదీలు లేని బాదం పాలు సహా పలు అనుమానాస్పద ఆహార పదార్థాలను గుర్తించారు. ప్రజారోగ్య భద్రతను దృష్టిలో ఉంచుకుని యూనిట్‌కు సంబంధించిన ఎఫ్ఎస్ఎస్ఏఐ నమోదు తాత్కాలికంగా నిలిపివేశారు.

**కాలం చెల్లిన పాలు.. మాడిపోయిన కోవా**



తనిఖీల్లో వాడకం చివరి తేదీ 04-10-2026గా ఉన్న 6 లీటర్ల దినేషాస్ ఫుల్ క్రీమ్ పాలు నాలుగు ప్యాకెట్లను పారవేయించారు. తయారీ, గడువు తేదీలు లేని 5 లీటర్ల బాదం పాలు, మాడిపోయిన 3 కిలోల కోవాను కూడా పారవేయించారు. కుల్ఫీ ప్యాకేజింగ్ విషయంలోనూ నిబంధనలు పాటించలేదని అధికారులు గుర్తించారు. సరైన ప్రయోగశాల పరీక్ష నివేదికలు లేకుండానే ఆహార ఉత్పత్తులకు 12 నెలల ఉత్తమ వినియోగ కాలం పేర్కొన్నట్లు తనిఖీల్లో వెల్లడైంది.

**సాలెగూళ్లు.. కీటకాలు.. పొగ, దుమ్ము మధ్య తయారీ!**

తయారీ ప్రాంతంలో సాధారణ పరిశుభ్రత పూర్తిగా లోపించినట్లు అధికారులు గుర్తించారు. పాలు మరిగించే, కోవా తయారు చేసే ప్రదేశాలు సగం తెరిచి ఉండటంతో పాటు పైకప్పుపై మసి, పొగ, దుమ్ము పేరుకుపోయి ఉన్నాయి. తయారీ ప్రాంతం పైకప్పు సాలెగూళ్లు, కీటకాలతో నిండిపోయి ఉంది. కిటికీలు, తలుపులకు కీటక నిరోధక జాలీలు లేకపోవడం, మురుగు కాలువలకు కప్పులు



లేకపోవడం, నేల పగిలి ఎగుడుదిగుడుగా ఉండటం, గోడలపై పెయింట్ ఊడిపోవడం వంటి లోపాలను గుర్తించారు. మరింత ఆందోళనకరంగా, కోవా తయారీ సమయంలో ఆహారాన్ని నిర్వహించే వ్యక్తి ధూమపానం చేస్తూ కనిపించినట్లు అధికారులు తెలిపారు. ఆహారాన్ని నిర్వహించే సిబ్బందికి ముఖముసుగులు, ఆప్రాన్లు, తల కవర్లు లేకపోవడం, వైద్య రికార్డులు, తెగుళ్ల నియంత్రణ రికార్డులు లేకపోవడం వంటి లోపాలు కూడా బయటపడ్డాయి. తయారీ ప్రాంతంలో తగినంత వెలుతురు, గాలి ప్రసరణ లేకపోవడంతో పాటు కుల్ఫీ చిల్లింగ్ రిఫ్రిజిరేటర్, మరో రెండు రిఫ్రిజిరేటర్ల తలుపులు తుప్పుపట్టి ఉన్నట్లు గుర్తించారు. ఆహార తయారీ కేంద్రంలో పరిశుభ్రత, ఆహార భద్రతా ప్రమాణాలు, సిబ్బంది వ్యక్తిగత పరిశుభ్రత వంటి కీలక అంశాల్లో తీవ్ర లోపాలు ఉన్నట్లు అధికారులు నిర్ధారించారు. ప్రజారోగ్యానికి సంబంధించిన అంశంగా పరిగణించిన అధికారులు సాయి సవారియా ఐస్‌క్రీమ్ యూనిట్‌కు సంబంధించిన ఎఫ్ఎస్ఎస్ఏఐ నమోదును తాత్కాలికంగా నిలిపివేసినట్లు ఆహార భద్రత అధికారి అరవింద్ రెడ్డి తెలిపారు.

# సింగరేణి భూమిలో అక్రమ మట్టి తవ్వకం

**8 మంది పట్టుబాటు.. జేసీబీ, నాలుగు ట్రాక్టర్లు స్వాధీనం**





**జనం వాయిస్, మంథని, అక్టోబర్ 5:**

సింగరేణి భూమిలో అనుమతులు లేకుండా మట్టి తవ్వి అక్రమంగా తరలిస్తున్న ఎనిమిది మందిని మంథని పోలీసులు పట్టుకున్నారు. వారి వద్ద నుంచి ఒక జేసీబీతో పాటు నాలుగు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నారు. రాచపల్లి ప్లాంటేషన్ శివారులోని సింగరేణి భూమిలో అక్రమంగా మట్టి తవ్వి తరలిస్తున్నట్లు పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది. దీంతో మంథని పోలీసులు సోమవారం ఉదయం ఘటనాస్థలానికి చేరుకుని తనిఖీలు చేపట్టారు. అక్కడ జేసీబీతో మట్టి తవ్వి నాలుగు ట్రాక్టర్లలో నింపుతున్న వారిని పోలీసులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. పోలీసుల విచారణలో అనుమతులు లేకుండా సింగరేణి భూమిలో మట్టి తవ్వి, వాణిజ్య ప్రయోజనాల కోసం తరలిస్తున్నట్లు వారు అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి తదుపరి చర్యలు చేపట్టినట్లు మంథని పోలీస్‌స్టేషన్ ఎస్ఐ ఎన్. సందీప్ కుమార్ తెలిపారు.

# బోయిన్‌పేటలో పోలీసుల నాకాబందీ.

**110 లీటర్ల గుడుంబా స్వాధీనం.. 3 కేసులు నమోదు.**

**35 ద్విచక్ర వాహనాలు స్వాధీనం.. 8 పెట్టీ కేసులు.**



**జనం వాయిస్, మంథని, అక్టోబర్ 5:**

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మంథని పోలీస్‌స్టేషన్ పరిధిలోని బోయిన్‌పేట గ్రామంలో సోమవారం కమ్యూనిటీ కాంటాక్ట్, నాకాబందీ కార్యక్రమాలను పోలీసులు నిర్వహించారు. గోదావరిఖని ఏసీపీ, మంథని సీఐతో పాటు పోలీసు సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామంలో విస్తృతంగా తనిఖీలు నిర్వహించిన పోలీసులు 110 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నారు. అక్రమ మద్యం తయారీ, విక్రయానికి పాల్పడుతున్న వారిపై మూడు కేసులు నమోదు చేశారు. అలాగే ద్విచక్ర వాహనాలపై ప్రత్యేక తనిఖీలు చేపట్టి నిబంధనలు ఉల్లంఘించిన 35 బైక్‌లను స్వాధీనం చేసుకుని, 8 పెట్టీ కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఏసీపీ గోదావరిఖని, మంథని సీఐ గ్రామస్థులతో మాట్లాడి సీసీటీవీ కెమెరాల ఏర్పాటుతో కలిగే ప్రయోజనాలు, మాదకద్రవ్యాల దుర్వినియోగం వల్ల కలిగే నష్టాలు, ఇతర సామాజిక సమస్యలపై అవగాహన కల్పించారు. గ్రామంలో అక్రమ మద్యం, మాదకద్రవ్యాలు, ఇతర చట్టవ్యతిరేక కార్యకలాపాలకు సంబంధించిన సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేసి సహకరించాలని ప్రజలను కోరారు.

డైనమిక్ జనం వాయిస్
తెలుగు దినపత్రిక WWW.JANAMVOICE.COM
RNI NO:TGTEL/26/A0383

# భూమి వివాదంలో పోలీసుల తీరుపై ఆరోపణలు

- ఆగస్టు 3న స్టేషన్ ఆవరణలోనే ఆత్మహత్యాయత్నం.
- సర్వే నంబరు మార్పునకు రూ.లక్ష ఇచ్చినట్లు ఆరోపణ.
- ఎస్సై, జీపీఓ, పెద్దమనుషుల తీరుపై విచారణకు డిమాండ్.

**జనం వాయిస్, శాయంపేట, అక్టోబరు 5:**





శాయంపేట మండలం గోవిందాపూర్‌లో వారసత్వ భూమి వివాదం ముదిరింది. తమను నమ్మబలికి భూమి రిజిస్ట్రేషన్ చేయించారని, అనంతరం పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి ఒత్తిడి తెచ్చారని రోడ్డ రామచందర్ చెల్లెలు శ్యామల ఆరోపించారు. ఈ ఒత్తిళ్లతోనే ఆగస్టు 3న తమ అన్న పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడని తెలిపారు.ఈ మేరకు సోమవారం శాయంపేటలో రామచందర్, శ్యామల, సరోజన, అడప దేవేంద్ర మీడియాతో మాట్లాడారు. పెద్దకోడపాక శివారులోని 678/1, 678/ఏ సర్వే నంబర్లలో తమకు రెండెకరాలు, ఆరే మొగిలికి మరో రెండెకరాలు ఉన్నాయని రామచందర్ తెలిపారు. బూర్గుల రామచంద్రరావుకు చెల్లించాల్సిన బయానా డబ్బులు తిరిగి చెల్లిస్తామని చెప్పినా కొందరు పెద్దమనుషులు నమ్మబలికి సంతకాలు చేయించి రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని ఆరోపించారు.

**జీపీఓపై ఆరోపణలు**

సర్వే నంబరు మార్పిడికి ఆరే మొగిలికి " ఫోన్-పే " ద్వారా జీపీఓ దేవేందర్‌కు రూ.లక్ష ఇచ్చినట్లు తమకు తెలిపారని కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఈ వ్యవహారంలో జీపీఓ పాత్రపై ఉన్నతాధికారులు విచారణ జరిపి నిజానిజాలు తేల్చాలని కోరారు.

**జేసీబీతో భూమి దున్నేందుకు యత్నం..**

తాజాగా దుగ్యాల రజనీకాంత్ జేసీబీ తీసుకురాగా, ట్రాక్టర్‌తో భూమిని దున్నేందుకు ప్రయత్నించారని కుటుంబ సభ్యులు ఆరోపించారు. 100కు ఫోన్ చేసినా పనులు ఆగలేదన్నారు. ఎస్సై పరమేష్, జీపీఓ దేవేందర్, పెద్దమనుషులు, దుగ్యాల రజనీకాంత్ పాత్రపై విచారణ జరిపి న్యాయం చేయాలని కోరారు.

**పోలీస్‌స్టేషన్ ఎదుట బైఠాయింపుపై కేసు...**

పోలీస్‌స్టేషన్ ఎదుట రోడ్డుపై రోడ్డ రామచందర్, శ్యామల, సరోజన, అడప దేవేంద్ర బైఠాయించారని ఎస్సై జక్కుల పరమేష్ తెలిపారు. ఎలాంటి అనుమతులు లేకుండా రోడ్డుపై బైఠాయించినందుకు నలుగురిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

# సిఈసి జ్ఞానేశ్ కుమార్‌ను వెంటనే పదవి నుంచి తొలగించాలి

**: ఎఐకెఎంఎస్ డిమాండ్**

**... అక్టోబర్ 6న జిల్లా కలెక్టరేట్ల వద్ద ధర్నాలు, 8న 'చలో రాజ్ భవన్' పిలుపుకు పూర్తి మద్దతు**

**... రాష్ట్ర అధ్యక్షులు మామిడాల బిక్షపతి, ప్రధాన కార్యదర్శి గౌని ఐలయ్య.**

**మహబూబాబాద్, అక్టోబర్ 5 (జనం వాయిస్) :**





కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ (సి-ఈసి) జ్ఞానేష్ కుమార్‌ను వెంటనే ఆ పదవి నుండి తొలగించి, ఆయనపై చట్టపరమైన విచారణ జరిపించాలని అఖిల భారత రైతు కూలీ సంఘం (ఎఐకెఎంఎస్) తెలంగాణ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షులు మామిడాల బిక్షపతి, ప్రధాన కార్యదర్శి గౌని ఐలయ్య సోమవారం ఒక సంయుక్త పత్రికా ప్రకటన విడుదల చేశారు. దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థను, రాజ్యాంగ స్ఫూర్తికి పట్టుగొమ్మ అయిన ఓటు హక్కును నిర్వీర్యం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్రలు చేస్తోందని వారు ఆరోపించారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) పేరుతో జరుగుతున్న అక్రమాలలో ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ నేరపూరిత పాత్ర పోషిస్తున్నారని, ఈ విషయాన్ని జాతీయ మీడియా కథనాలు బట్టబయలు చేశాయని పేర్కొన్నారు. కేంద్రంలోని అధికార భారతీయ జనతా పార్టీకి అనుకూలంగా, ఏకపక్షంగా వ్యవహరిస్తూ జ్ఞానేష్ కుమార్ ఎన్నికల వ్యవస్థను దుర్వినియోగం చేస్తున్నారని ఎఐకెఎంఎస్ నాయకులు విమర్శించారు. ఎస్.ఐ.ఆర్ (సర్) ప్రక్రియ ద్వారా దేశవ్యాప్తంగా కోట్లాది మంది ఓట్లను అన్యాయంగా తొలగిస్తూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని మండిపడ్డారు. ఆర్ఎస్ఎస్ ఎజెండా అయిన హిందూత్వ రాజ్యాంగాన్ని రుద్దేందుకు, బీజేపీ అధికారాన్ని శాశ్వతం చేసేందుకే ఇటువంటి ఫాసిస్టు ధోరణికి పూనుకున్నారని ధ్వజమెత్తారు. ఈ నేపథ్యంలో జ్ఞానేష్ కుమార్‌ను వెంటనే బాధ్యతల నుంచి తప్పించాలని, ఎస్.ఐ.ఆర్ ప్రక్రియను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు.

**ఆందోళనలకు ఎఐకెఎంఎస్ మద్దతు :**

డిమాండ్ల సాధనకై రాష్ట్రంలోని తొమ్మిది కమ్యూనిస్టు పార్టీలు, కాంగ్రెస్, తెలంగాణ జనసమితి (టీజేఎస్) సహా వివిధ రాజకీయ పార్టీలు ఇచ్చిన ఆందోళన కార్యక్రమాలకు ఎఐకెఎంఎస్ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా: అక్టోబర్ 6న: రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల కలెక్టర్ కార్యాలయాల వద్ద ధర్నాలు. అక్టోబర్ 8న: రాజ్‌భవన్‌ను ముట్టడించే 'చలో రాజ్ భవన్' కార్యక్రమం. ఈ నిరసన కార్యక్రమాలలో సంఘం యొక్క జిల్లా, స్థానిక శాఖల నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని రాష్ట్ర కార్యవర్గం పిలుపునిచ్చింది.

# ఆక్రమణదారుల చేతిలో పాఠశాల భూమి

**డిజిటల్ సర్వేతో సరిహద్దులు తేల్చాలని డిమాండ్**

**తహశీల్దార్ కార్యాలయంలో అనాధికార అసిస్టెంట్ 'లవన్'పై చర్యలకు వినతి**

**'ప్రజావాణి'లో ఫిర్యాదు చేసిన కురవి 5వ వార్డు సభ్యులు నూతక్కి సాంబశివరావు**

**కురవి, అక్టోబర్ 5 (జనం వాయిస్) :**



కురవి మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలకు చెందిన విద్యా నిలయ భూములు అక్రమార్కుల చేతుల్లోకి వెళ్తున్నాయని, సమగ్ర విచారణ జరిపి భూమిని కాపాడాలని 5వ వార్డు సభ్యులు నూతక్కి సాంబశివరావు సోమవారం కురవిలో నిర్వహించిన 'ప్రజావాణి' కార్యక్రమంలో ప్రజా పాలన అధికారులకు ఫిర్యాదు చేశారు.

**9 ఎకరాల 30 గుంటల్లో.. 3 ఎకరాల 30 గుంటలు అన్యాక్రాంతం**

కురవి ప్రభుత్వ పాఠశాలకు సంబంధించి సర్వే నెంబర్లు 742, 743, 744, 527/ఏ, 528/ఏ, 529/ఏ2/2లలో మొత్తం 9 ఎకరాల 30 గుంటల ప్రభుత్వ భూమిని కేటాయించారని సాంబశివరావు పేర్కొన్నారు. అయితే ఇందులో ఏకంగా 3 ఎకరాల 30 గుంటల భూమి ఆక్రమణకు గురైందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల "జనం వాయిస్" దినపత్రికలో "అక్రమార్కుల చేతిలో సరస్వతి నిలయం" శీర్షికతో కథనం ప్రచురితమైన విషయాన్ని గుర్తుచేస్తూ.. రెవిన్యూ అధికారులు తక్షణమే స్పందించి డిజిటల్ సర్వే నిర్వహించాలని డిమాండ్ చేశారు. హద్దులు నిర్ధారించి, ఆక్రమణలను తొలగించి ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి సహకరించాలని కోరారు.

**అనాధికారిక అసిస్టెంట్ 'లవన్'పై క్రిమినల్ కేసు పెట్టాలి**

తహశీల్దార్ కార్యాలయంలో సర్వేయర్ వద్ద "లవన్" అనే వ్యక్తి నిబంధనలకు విరుద్ధంగా గత కొన్నేళ్లుగా అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. కురవి మండలంలో జరిగే భూ వివాదాల్లో అతను జోక్యం చేసుకుంటూ, సర్వేయర్లకు తప్పుడు సమాచారం ఇస్తూ పంచాయతీలకు కారణమవుతున్నాడని ఆరోపించారు. అధికారులు వెంటనే దీనిపై సమగ్ర విచారణ జరిపి, అనాధికారికంగా వ్యవహరిస్తున్న లవన్ అనే వ్యక్తిపై క్రిమినల్ కేసు నమోదు చేయడంతో పాటు కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# శాయంపేటలో బీఆర్ఎస్‌కు మరో కార్యాలయం

**సిరికొండ మధుసూదనాచారి అభిమానుల ఆధ్వర్యంలో ఏర్పాటు**

**జనం వాయిస్,శాయంపేట,అక్టోబరు 5:**

శాయంపేట మండల కేంద్రంలో తెలంగాణ తొలి సభాపతి సిరికొండ మధుసూదనాచారి అభిమానుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ ఉద్యమకారుల కార్యాలయాన్ని సోమవారం గట్లకానిపర్తికి చెందిన ఉద్యమ అమరురాలు సోనీ తండ్రి మల్లేష్ ప్రారంభించారు. బీఆర్ఎస్ నాయకులు గుర్రం రవీందర్, పొడిశెట్టి గణేష్, కొత్తగట్టు సాయి మాట్లాడుతూ.. ప్రజా సమస్యలపై పోరాటాలకు కార్యాలయం వేదికగా ఉంటుందని తెలిపారు. భూపాలపల్లి నియోజకవర్గంలో పార్టీ అధిష్ఠానం ఎవరికి టికెట్ ఇచ్చినా సమన్వయంతో పనిచేసి అభ్యర్థి విజయానికి కృషి చేస్తామన్నారు. మండల కేంద్రంలో ఇప్పటికే బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం ఉండగా.. తాజాగా మరో కార్యాలయం ఏర్పాటు కావడం చర్చనీయాంశంగా మారింది.ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ రాష్ట్ర నాయకులు గజ్జి శంకర్, నిమ్మల మహేందర్, బగ్గి రమేష్, అడప ప్రభాకర్, పల్లెబోయిన సారయ్య, అరికిల్ల విజయ్,బేరుగు తరుణ్ గోపి, బాసాని వెంకటేశ్వర్లు, గుర్రం అశోక్, కోడెపాక సందీప్ తదితరులు పాల్గొన్నారు.



# అదృశ్యమైన ఇద్దరు బాలుర ఆచూకీ లభ్యం

**... అప్రమత్తతతో ఆదుకున్న దంతాలపల్లి పోలీసులు**

**మహబూబాబాద్, అక్టోబర్ 5 (జనం వాయిస్) :**




నెల్లూరు జిల్లాలో తప్పిపోయిన ఇద్దరు చిన్నారులను దంతాలపల్లి పోలీసులు అప్రమత్తంగా వ్యవహరించి సురక్షితంగా రక్షించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నెల్లూరు జిల్లా నవాబుపేట పోలీస్ స్టేషన్ పరిధికి చెందిన ఎల్లంపల్లి వెంకటేష్ (12), ఎల్లంపల్లి వెంకటేశ్వర్లు (10) అనే ఇద్దరు సోదరులు గత నెల (సెప్టెంబర్) 26న చేపల వేటకు వెళ్లి తిరిగి వస్తూ దారి తప్పి అదృశ్యమయ్యారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు నవాబుపేట పోలీసులు కేసు నమోదు చేసి గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో సోమవారం దంతాలపల్లి సెంటర్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న ఆ ఇద్దరు పిల్లలను దంతాలపల్లి పోలీస్ స్టేషన్‌కు చెందిన కానిస్టేబుళ్లు పీసీ-2471, పీసీ-05 గమనించారు. వారిని దగ్గరకు పిలిచి వివరాలు విచారించగా, నవాబుపేట పరిధిలో అదృశ్యమైన బాలురగా గుర్తించారు. వెంటనే వారిని స్టేషన్‌కు తరలించి, నవాబుపేట పోలీసులకు సమాచారం అందించారు. మంగళవారం ఉదయం నవాబుపేట పోలీసులు దంతాలపల్లి చేరుకుని, బాలురను వారి తల్లిదండ్రులకు అప్పగించనున్నారు. సమయస్ఫూర్తితో వ్యవహరించి చిన్నారుల ఆచూకీ కనిపెట్టిన కానిస్టేబుళ్లను దంతాలపల్లి ఎస్ఐ ప్రత్యేకంగా అభినందించారు.

# యూపీఐ చెల్లింపులపై చార్జీలను వెంటనే రద్దు చేయాలి

**-- సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు నల్లు సుధాకర్ రెడ్డి**

**-- క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటాలు నిర్మించాలి**

**-- మరిపెడ పట్టణ సీపీఐ నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక**

**మహబూబాబాద్, అక్టోబర్ 5 (జనం వాయిస్) :**



యూపీఐ చెల్లింపులపై రకరకాల పేర్లతో చార్జీలు విధించే విధానాన్ని కేంద్రంలోని మోదీ ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు నల్లు సుధాకర్ రెడ్డి డిమాండ్ చేశారు. మరిపెడ మున్సిపల్ కేంద్రంలో నిర్వహించిన సీపీఐ పట్టణ కార్యవర్గ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. డిజిటల్ చెల్లింపులు, నగదు రహిత ఆర్థిక వ్యవస్థ అంటూ విస్తృత ప్రచారం చేసి సామాన్య, పేద, మధ్యతరగతి ప్రజలను యూపీఐ వినియోగానికి అలవాటు చేసిన కేంద్ర ప్రభుత్వం.. ఇప్పుడు వారిపై భారం మోపేలా మోసపూరిత విధానాలను అవలంబిస్తోందని మండిపడ్డారు. వ్యాపారులపై ప్రత్యక్షంగా, పరోక్షంగా 'ఎండీఆర్' పేరిట 0.4 శాతం చార్జీలు వసూలు చేయడాన్ని తక్షణమే విరమించుకోవాలని సూచించారు.

**సామాన్యులపై దొడ్డిదారిన భారం:**

సామాన్యులపై ఎటువంటి భారం వేయడం లేదని చెబుతున్నప్పటికీ, వ్యాపారులపై విధించే ఎండీఆర్ చార్జీల భారం అంతిమంగా వినియోగదారులపైనే పడుతుందనే నగ్న సత్యాన్ని మోదీ ప్రభుత్వం దాచే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. ఇలా దొడ్డిదారిన ప్రజలను మోసం చేయడం తగదని, రాబోయే రోజుల్లో వ్యక్తుల మధ్య జరిగే (పి2పి) సాధారణ లావాదేవీలపై కూడా చార్జీలు వేసే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

**ప్రజా సమస్యలపై పోరాటాలకు పిలుపు:**

పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయాలని, సంక్షేమ పథకాలు అర్హులైన ప్రజలందరికీ చేరేలా చూడాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ఎప్పటికప్పుడు బలిష్టమైన పోరాటాలు నిర్మించాలని కోరారు.

**నూతన కమిటీ ఎన్నిక:**

సమావేశంలో మరిపెడ సీపీఐ పట్టణ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణ కార్యదర్శిగా పగిల్ల అంజి, సహాయ కార్యదర్శిగా రాసాల వీరేందర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి మా రంగాని బాలకృష్ణ, జిల్లా కౌన్సిల్ సభ్యులు అబ్దుల్ రషీద్, తురక రమేష్, పానుబోతు ఎంకన్న, హనుమంతు, రాములు, మధు, వెంకన్న తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# విద్యార్థులకు టీ-షర్టులు, విద్యాసామాగ్రి పంపిణీ

**మహబూబాబాద్, అక్టోబర్ 5 (జనం వాయిస్) :**



మహబూబాబాద్ మండల పరిధిలోని ప్రాథమిక పాఠశాల మొట్ల తండా విద్యార్థినీ విద్యార్థులకు స్ఫూర్తి ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో కంటెం నవీన్, కంటెం శ్రీదేవి సహకారంతో టీ-షర్టులు, విద్యాసామాగ్రిని సోమవారం ఘనంగా పంపిణీ చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి కంబాలపల్లి స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు శ్రీమతి గిరిజ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు టీ-షర్టులతో పాటు విద్యాసామాగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులకు సహాయం అందించడం అభినందనీయమని, స్ఫూర్తి ఎడ్యుకేషనల్ సొసైటీ వారి సేవా నిరతికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. అనంతరం హెచ్ఎం సత్యనారాయణ మాట్లాడుతూ.. విద్యాసామాగ్రితో పాటు విద్యార్థులకు ఎంతో ఆకర్షణీయమైన టీ-షర్టులను అందించిన కంటెం శ్రీదేవి-నవీన్ దంపతులకు, సొసైటీ అధ్యక్షులు రామసహాయం శ్రీధర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి, పోటీ పరీక్షల పుస్తకాలు, నోట్ పుస్తకాలు అందిస్తూ వారు చేస్తున్న సేవలు ఎంతో ప్రశంసనీయమని పేర్కొన్నారు. స్ఫూర్తి రూరల్ ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షులు రామసహాయం శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లోని పేద విద్యార్థులు ప్రైవేటు పాఠశాలలకు ఏమాత్రం తీసిపోకుండా ఉన్నత స్థాయికి ఎదగాలన్నదే తమ సంస్థ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల విద్యాభివృద్ధికి తమ సంస్థ నిరంతరం కృషి చేస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కంబాలపల్లి స్కూల్ కాంప్లెక్స్ అసిస్టెంట్ సెక్రెటరీ శ్రీమతి లక్ష్మి, సొసైటీ ప్రధాన కార్యదర్శి మేకల కృష్ణయ్య, ప్రతినిధి యన్.ఉపేందర్ రెడ్డి, గ్రామ సర్పంచ్ మూడ్ బిక్ష, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ ఓటు కోసం పట్టభద్రులు ఆన్లైన్లో అప్లై చేసుకోండి.

**జనం వాయిస్, పినపాక, అక్టోబర్ 5:**



రాబోయే ఖమ్మం, నల్గొండ ,వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటు కొరకు మూడు సంవత్సరాల క్రితం డిగ్రీ పాస్ అయిన పట్టభద్రులు అర్హులు, అంటే 2023, 24 లో ఎవరైతే డిగ్రీ పూర్తిచేసుకుని ఉన్నారో, వారు అర్హులని పినపాక పిఎసిఎస్ చైర్మన్, జానంపేట బిఆర్ఎస్ సీనియర్ నాయకులు ముదునూరి రవి శేఖర్ వర్మ చెప్పారు. ఈ అవకాశం సెప్టెంబర్ 28 నుంచి నవంబర్ 6 వ తేదీ వరకు మాత్రమే ఉన్నదని తెలియజేశారు. ఈ అవకాశాన్ని పట్టభద్రులైన యువతి, యువకులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన చెప్పారు. రాబోయే ఎమ్మెల్సీ ఎలక్షన్లో ఓటు ఒక ఆయుధమని, ఒక మంచి నిర్ణయంతో ఓటుని సద్వినియోగం చేసుకోవాలని, సలహాలు ఇచ్చే వ్యక్తులు కాకుండా సహాయం చేసే వ్యక్తులను ఎన్నుకోవాలని,గత ప్రభుత్వానికి, ఇప్పటి ప్రభుత్వానికి ఉన్న వ్యత్యాసాన్ని గుర్తించాలని, బిఆర్ఎస్ నాయకులు వర్మ తెలియజేశారు. ఓటుకు నోటు కేసులో ఇరుక్కొని ప్రభుత్వాన్ని నడుపుతున్న రేవంత్ రెడ్డి ముఖ్యమా? రాబోయే భవిష్యత్తు తరాల కోసం సేవ చేసే నాయకుడు కెసిఆర్ ముఖ్యమా.. అని చెప్పారు. ఈ కార్యక్రమంలో జానంపేట బిఆర్ఎస్ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

# 54 మంది లబ్ధిదారులకు 54.86 లక్షల కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ.

**పాలకుర్తి మండలంలోని కళ్యాణాలక్ష్మి షాది ముబారక్ చెక్కుల పండుగ.**

**54 మంది కుటుంబ సభ్యుల కళ్ళలో ఆనందం నింపిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం.**

**ఒక్కొక్క కుటుంబానికి 1,00,116 రూ మొత్తం 54 లక్షల 864 రూ. పంపిణీ చేసిన ఎమ్మెల్యే యశస్విని రెడ్డి.**

**అక్టోబర్ 5 జనం వాయిస్ పాలకుర్తి:**



పాలకుర్తి మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పాలకుర్తి మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 54 మంది లబ్ధిదారులకు మొత్తం 54,00,864 విలువైన కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పాలకుర్తి శాసన సభ్యురాలు మామిడాల యశస్విని రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు చెక్కులను అందజేసి, వారి కుటుంబాలకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి లబ్ధిదారుడు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు, లబ్ధిదారులు, వారి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# అక్రమంగా తొలగించిన ఓటర్లను జాబితాలో చేర్చాలి

**సిఈసి జ్ఞానేష్ కుమార్ ను బాధ్యతలనుంచి తప్పించాలి.**

**సిపిఎం ఆధ్వర్యంలో నిరసన.**



**అక్టోబర్ 5 జనం వాయిస్ పాలకుర్తి:**

ఎన్నికల వ్యవస్థను రాజకీయ ప్రయోజనాలకు అనుగుణంగా ప్రభావితం చేసే ప్రయత్నాలను అడ్డుకోవాలని సిఇసి జ్ఞానేశ్ కుమార్ ను బాధ్యతలనుంచి తప్పించాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు చిట్యాల సోమన్న, మండల కార్యదర్శి మాచర్ల సారయ్య డిమాండ్ చేశారు. సోమవారం పాలకుర్తి నియోజకవర్గ కేంద్రంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాలు ఐలమ్మ చౌరస్తాలో సిపిఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు పాల్గొని మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ రాజ్యాంగబద్ధమైన స్వతంత్ర సంస్థగా నిష్పక్ష పాతంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు, రాజ్యాంగ సంస్థల స్వతంతను దెబ్బతీసే చర్యలు ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమన్నారు, ఎన్నికల జాబితాలు ఓటర్ల హక్కులు ఎన్నికల నిర్వహణలో పారదర్శకత, అన్ని రాజకీయ పార్టీలకు సమాన అవకాశాల విషయంలో ఎన్నికల కమిషన్ ఎలాంటి పక్షపాతానికి తవు లేకుండా వ్యవహరించాలన్నారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ గా ఉన్న జ్ఞానేశ్ కుమార్ వ్యవహార శైలి పై వస్తున్న అభ్యంతరాలను పరిగణంలోకి తీసుకొని ఆయనను బాధ్యతల నుంచి తప్పించాలని ఎన్నికల కమిషన్ పై ప్రజల్లో విశ్వాసం పెంచేలా నిష్పక్షపాత చర్యలు చేపట్టాలని కోరారు, ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరించే వారిని కీలక రాజ్యాంగ సంస్థలు నియమించడం వల్ల ప్రజాస్వామ్య వ్యవస్థలపై ప్రజలకు ఉన్న నమ్మకాన్ని దెబ్బతీస్తున్నట్లు వెల్లడించారు. ఎన్నికల కమిషన్ స్వతంత్రను కాపాడటం ద్వారా ప్రజాస్వామ్యాన్ని ఓటు హక్కును పరిరక్షించాలని ప్రజలను చైతన్యపరిచి ప్రజా ఉద్యమాన్ని చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు సోమసత్యం, మాసంపల్లి నాగయ్య, ఏదునూరి మదార్, బెల్లి సంపత్, కౌడగాని మల్లేష్, పనికిరా భాస్కర్, నాయిని శ్రీను, తాటికాయల జానీ, జక్కుల శోభన్ బాబు, వేల్పుల కొమురయ్య, కాకర్ల పద్మ, తోటరాజు, చిట్యాల సంధ్యారాణి, కొంరమ్మ, బాణాల బాలమ్మ, సోమక్క, పెద్దాపురం, భాష బోయిన కుమార్, ఏ రాజు, బరిగాల పోతన, చెలుకపల్లి సోమయ్య తదితరులు పాల్గొన్నారు

# సర్కార్ బడికి సౌండ్ సిస్టం అందజేత

**అక్టోబర్ 5 జనం వాయిస్ పాలకుర్తి:**

పాలకుర్తి మండలంలోని ఎంపీపీఎస్ తిరుమలగిరి పాఠశాలకు తాళ్ల పెల్లి యాకలక్ష్మి-కృష్ణ దంపతులు చేయూతనందించారు. 6000 రూపాయల విలువగల సౌండ్ సిస్టంను బహుకరించారు. ఆయా సౌండ్ సిస్టంను గ్రామస్తులు, దాత ఉపాధ్యాయులకు అందించారు. బడి బాగుకు మనసున్న మహారాజులు, దాతలు ముందుకు రావడం సంతోషకరమని సర్పంచ్ చెరిపల్లి మమత అన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఈర్ల రాజు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు జె. సత్యనారాయణ, ఉపాధ్యాయుడు ఎ.రాజ్ కుమార్, గ్రామ సెక్రెటరీ హైమావతి, కూటికంటి నరేష్, కౌడగాని సుధాకర్, బక్క రాజు, మాసంపల్లి రణధీర్ పాల్గొన్నారు. దాతను గ్రామస్తులు సత్కరించారు.

